# “అతనియందు ఏ దోషము నాకు కనబడలేదు” (18:1-19:16)

ప్రతి పాటకు ప్రత్యేకించిన మూడ్ ఉంటుంది. కొన్ని ఆలాపనలు మన ముఖానికి చిరునవ్వు తెస్తాయి, మరికొన్ని మన కన్నులకు బాష్ప బిందువులను తెస్తాయి. కొన్ని మన జీవితంలోని శ్రేష్ఠమైన దినాలను జ్ఞాపకం చేస్తాయి. మరికొన్ని పరితాపాలను గుర్తు చేస్తాయి. పాటలను గూర్చి మనకు ఈ సంగతులు తెలుసు, పైగా అలా మనం ఎదురు చూస్తాం కూడా. అయితే బైబిలు లేఖన భాగాలనుండి కూడా మనం అలాగే ఎదురు చూడవలసి వస్తుంది. ఈ పాఠంలో చదివే భాగం లేఖనాల్లో బహు బాధాకరమైన లేఖన భాగమైయుంది.

పదిహేడు అధ్యాయాలవరకు, ప్రభువైన యేసు యొక్క జీవితము మరియు పరిచర్య అనేదాన్ని చదివాం. ప్రభువైన యేసు చెప్పినదాన్ని, యోహాను రిపోర్టు చేశాడు. దాన్ని చదివినవారి హృదయాల్లో విశ్వాసం పుట్టించేలా సంఘటనలను క్రమపరచాడు. 18వ అధ్యాయపు ఆరంభంలో, ప్రభువైన యేసు నేరుగా సిలువ చెంతకు సాగుతున్నాడు. తన జీవితంలో చెప్పబడిన గురి అదే, ఉద్దేశం కూడా అదే. ఉద్వేగంతో కూడిన కష్టమైన ఈ భాగము, ప్రభువైన యేసు సిలువ వేయబడడానికి కొన్ని గంటల ముందుగా ఆయనకు సంభవించిన మూడు విచారణలను గూర్చి చెప్తుతుంది. ఈ మూడును ముప్పేట తాడువలె పెనవేయబడి - ఆయన కుమారునిగూర్చియు, ఆయనయందలి విశ్వాసం యొక్క ప్రాధాన్యతను గూర్చియు దైవ సందేశాన్ని కలిగియుంది.

## యేసు యొక్క విచారణ

ఆ రాత్రివేళ తన శిష్యులతోపాటు భుజించి ప్రార్థించిన తరువాత, కిద్రోనులోయ దాటేలా ప్రభువు వారిని నడిపించాడు (18:1),[1] తన శిష్యులతోపాటు తరచుగా ఆయన ప్రార్థించడానికి వచ్చే చోటు అదియే. తాను బంధించబడడానికి వెనుకంజ వేయలేదు. రాత్రియందు యేసును బంధించడం ద్వారా ఆయనను మోసగించినట్టు వారు భావించారు. ఆయనను కాపాడడానికి జనసమూహాలు ఆయన చుట్టు లేరని వారు భావించారు. వాస్తవానికి, తన్ను పట్టుకొనడానికి యూదాకును, సైనికులకును సులభమైన మార్గాన్ని ఆయనే ఏర్పాటు చేశాడు.

ఆయనను వెదక వచ్చినవారిలో యూదాయు సైనికులును ప్రధానయాజకులును పరిసయ్యులును పంపిన బంట్రౌతులున్నారు. వారు దివిటీలతోను, దీపములతోను, ఆయుధములతోను అక్కడికి వచ్చారు. ప్రభువు - “మీరెవని వెదకుచున్నారని” వారిని

అడిగెను (18:4). వారు "–నజరేయుడైన యేసునని" (18:5) ఆయనకు ఉత్తరమియ్యగా యేసు "–ఆయనను నేనే" అని వారితో (18:5) చెప్పగా వారు వెనుకకు తగ్గి నేలమీద పడ్డారు. "మరల ఆయన – మీరు ఎవనిని వెదకుచున్నారని వారిని అడిగెను." అందుకు వారు "నజరేయుడైన యేసునని" చెప్పారు (18:7). వారు వెదక వచ్చిన ఆ మనుష్యుడను నేనే అని ఆయన మరొకమారు తెలిపాడు. చివరిగా, ఆయనను పట్టుకొని బంధించి తీర్పు కొరకు యెరూషలేమునకు తోడుకొనిపోయారు. పట్టుబడకుండ తప్పించుకొన జూసే మనిషిలా ఆయన కన్పించలేదు; జరుగబోయే సంభవాలు ఎంతో ప్రాముఖ్యమైనవని ఎరిగిన మనిషిలా ఆయన ప్రవర్తించాడు.

తీర్పుకై యేసును కొనిపోయి నిలువబెట్టింది మాజీ ప్రధానయాజకుడైన అన్నా యింట. ఇతని అల్లుడైన కయప ప్రస్తుతపు ప్రధానయాజకుడు. మొదటిగా ప్రభువును అతని యింటికి తోడుకొని వెళ్లడంలో, ప్రధానయాజకుడనే బిరుదు తన అల్లునికి ఉన్నా, నిజమైన అధికారం అతని చేతిలోనే ఉన్నట్టుంది. అన్నా యింటి వద్ద ఆయన బోధను గూర్చియు, ఆయన ఆకర్షించిన శిష్యులను గూర్చియు ప్రశ్నించారు. తన బోధలు రహస్యమైనవి కాదని బహిరంగంగానే బోధింపబడ్డాయని, కావాలంటే విన్నవారిని విచారించుమని తెలిపినప్పుడు, అన్నాకు "అమర్యాదగా" జవాబిచ్చినట్టు అక్కడ నిలిచిన వారిలో ఒకడు ఆయనను అరచేతితో కొట్టాడు, అటు తరువాత, ఆయన చేతులు బంధింపబడియున్న రీతినే అన్నా ఆయనను కయప యింటికి పంపాడు.

కయప యింటనుండి, "ప్రేతోరియం" అని పిలువబడే రోమా గవర్నర్ యొక్క అధికార మందిరమునకు యేసును తీసికొనిపోయిరి (18:28).[2] ప్రభువైన యేసు జీవితానికి అది సంబంధించిందై యుండకుంటే, దానివెంట జరిగిన సంఘటన తమాషాగా ఉండేది. ఎందుకంటే – ప్రేతోరియం అనేది అన్యజనులకు సంబంధించిన యిల్లుగా భావించబడేది. దానిలోనికి యూదులు ప్రవేశించడం ఊహకు అందనిది. అందులో పస్కా పండుగ కాలంలో[3] అది రెట్టింపు పట్టింపుగా ఉండాలి! యూదా మత నాయకులతో మాట్లాడడానికి పిలాతు తన యింటిలోనుండి వెలుపలికి రావాలి, యేసుకు మరణ శిక్ష వారు కోరాలి. ఆ తరువాత కొన్ని గంటలవరకు ఇంటిలోనికి బయటికి పలుమార్లు తిరిగాడు. యేసును విడిపించడానికి ప్రయత్నించాడు – జరుగుతున్న సంభవాలకు అర్థమేమైనా ఉందాయని యోచిస్తూ ఆ పనిమీద ఉన్నాడు.

మొదట్లో "పిలాతు – మీరతని తీసికొనిపోయి మీ ధర్మశాస్త్రముచొప్పున అతనికి తీర్పుతీర్చుడనగా యూదులు – ఎవనికిని మరణశిక్ష విధించుటకు మాకు అధికారము లేదని అతనితో చెప్పిరి ..." (18:31, 32). మరణ శిక్ష అనేది కేవలం రోమా అధిపతి మాత్రమే విధించు అధికారం గలవాడైయున్నాడు. పిలాతు యేసును లోపలికి తీసికొని పోయి ప్రశ్నింపసాగాడు. "యూదుల రాజువు నీవేనా?" (18:33). ఆయన అతనికి నేరైన జవాబు యివ్వకపోయేసరికి, "నేను యూదుడనా యేమి" అని మండిపడ్డాడు (18:35).[4] ప్రభువు అతనికి యిలా బదులిచ్చాడు:

–నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే

> నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహసంబంధమైనది కాదనెను (18:36).

యేసుతో విసుగు చెందిన సంభాషణానంతరం, పిలాతు "మరల బయటికి వెళ్లి" అతని యందు తనకు ఏ దోషము కానరానట్టు యూదులకు తెలిపాడు (18:38). (ఆ మాటలు పలకడంలో ఎంత సరిగా చెప్పాడో కూడా అతడు గ్రహించియుండడు!)

తన వద్దకు తీర్పుకై తెచ్చిన వానితో విచారణ జరపడం వారు తృప్తిపడతారని పిలాతు నిరీక్షించినట్టున్నాడు. అయితే అది చాలలేదు. తన "పరువు దక్కించుకునే" మార్గాన్ని అతడు వారికి చూపినప్పుడు, నరహంతకుని[5] వారికి విడుదల చేసి యేసును సిలువ వేయించగోరారు. యేసుపై నేరం మోపేవారిని సంతృప్తిపరచే తన ప్రయత్నంలో విసిగి పోయినవాడై, తన సైనికులు ఆయనను కొరడాలతో కొట్టడానికిని, అవమానించ డానికిని పిలాతు అనుమతించాడు. ఈ సమయమందే ఆయన తలమీద ముండ్ల కిరీటమును, ఎర్రని నిలువుటంగీయు ధరింపజేయడం జరిగింది.

అవమానకరమైన అంగీయు, కిరీటమును ప్రభువు ధరించియున్నప్పుడు, పిలాతు ఆయనను వెలుపలికి తీసికొని వచ్చి యూదా మత నాయకులకు చూపించాడు. యేసుపై తమకున్న ద్వేషాన్ని అది సంతుష్టి పరచుతుందని పిలాతు భావించియుంటే, అతడు పూర్తిగా వారిని అపార్థం చేసికొనియుంటాడు. "సిలువ వేయుము, సిలువ వేయుమని" వారు మరల కేకలు వేశారు (19:6). ఆ పని వారినే చేయుమని పిలాతు అన్నాడు. ఆయన దేవుని కుమారుడనని చెప్పుకొన్నట్టు వారు పిలాతుకు తెలిపారు. ఆయనను క్షమించాలనే కోర్కె పిలాతుకు కలిగేదానికి బదులు, అతనికి భయం పుట్టుకొచ్చింది. యూదులు ఆరాధించే దేవుని పిలాతు నమ్మకపోయినా, తన కుమారుని చంపడంవలన ఆ దేవునికి కోపం పుట్టించడం పిలాతుకు యిష్టం లేకుండాపోయింది!

యేసును ఏమి చేయాలనే సమస్యకు తప్పించుకునే పరిష్కారం కనుగొనే ప్రయత్నంలో, ఆయనను తిరిగి ప్రేతోరియంలోనికి కొనిపోయి పిలాతు మరల ప్రశ్నింపసాగాడు. ఈ సమయంలో పిలాతు ప్రశ్నలకు ప్రభువు బదులియ్య నిరాకరించినప్పుడు "పిలాతు – నాతో మాటలాడవా? నిన్ను విడుదల చేయుటకు నాకు అధికారము కలదనియు నిన్ను సిలువ వేయుటకు నాకు అధికారము కలదనియు నీ వెరుగవా? అని ఆయనతో అనెను" (19:10). (బిగ్గరగా అరిసియుండవచ్చు!) "అందుకు యేసు – పైనుండి నీకు ఇయ్యబడియుంటేనే తప్ప నామీద నీకు ఏ అధికారమును ఉండదు; అందుచేత నన్ను నీకు అప్పగించినవానికి ఎక్కువ పాపము కలదనెను" (19:11).[6] ఈ విషయంలో, యేసును విడుదల చేయడానికి పిలాతు మరి ఎక్కువగా ప్రయత్నించాడు.

యేసును విడిపించడానికి పిలాతు చేసిన చివరి ప్రయత్నాన్ని యూదా మత నాయకులు నిరాకరించినప్పుడు, పిలాతు యిక సహించలేకపోయాడు. యేసును గబ్బతా అనే స్థలానికి తీసికొనిపోయాడు. అధికార పూర్వకంగా తీర్పులు జరిగించేది అక్కడే. అక్కడ, "–ఇదిగో మీ రాజు" అని చెప్పాడు (19:14), సిలువ వేయడానికి ఆయనను అప్పగించాడు. యేసు యొక్క తీర్పు ముగించబడింది.

న్యాయశాస్త్రాన్ని బట్టియైతే, ఆ రాత్రివేళ జరిగిన కార్యక్రమం విషాదకరమైనదియు, అవమానపరచునదియునై ఉంది. యోహాను వివరించిన విచారణను బట్టి, ప్రభువైన యేసు నిర్దోషిగా తీర్చబడ్డాడు! అధికారము, రాజకీయము అనేవి సత్యాన్ని, న్యాయాన్ని త్రోసిపుచ్చాయి. "తప్పుడు జనానికి" బెదురుగా మారినందుననే ఒక నిర్దోషియైనవానికి శిక్ష విధించారు. ఏదియెలాగున్నా, క్రైస్తవులకైతే మాత్రం ఆ రాత్రిలోను మరుసటి ఉదయంలోను జరిగిన సంభవాలకు వేరైన దృక్పథం ఉంది. అది భయంకరమైన దుఃఖకరమైన విషయమైనట్టు ప్రాథమికంగా మనం చూడము, కాని ఔదార్యంతో కూడిన బహుమానంగా చూస్తాం. ప్రభువైన యేసు యొక్క ప్రాణం ఆయన వద్దనుండి లాగివేయబడినట్టు చెప్పలేదు; ఆయనచే అది యిష్టపూర్వకంగా యివ్వబడినట్టే యోహాను నొక్కి చెప్పాడు.

## పేతురు విచారణ

ఆ రాత్రి జరిగిన రెండవ విచారణ పేతురు యొక్క ఆత్మ సంబంధమైన విచారణ. ఇతని కథను ప్రభువైన యేసు తన శిష్యుల పాదాలను కడిగినప్పటినుండి చూద్దాం. పేతురు తన నిజ స్వభావానికి నమ్మకంగా ఉన్నవాడై, మొదటిలో తన పాదాలను ఆయన కడగడానికి అభ్యంతరం తెలిపాడు; ఆ తరువాత తన్ను సంపూర్ణంగా కడుగమని ఆయనను కోరాడు (13:6-9). పేతురు ఉద్రేకి. గనుక, తరువాత "-నేను వెళ్లుచున్న చోటికి నీవిప్పుడు నావెంట రాలేవుగాని, తరువాత వచ్చెదవని" అతనితో చెప్పినప్పుడు, "-ప్రభువా, నేనెందుకు ఇప్పుడు నీ వెంట రాలేను? నీ కొరకు నా ప్రాణము పెట్టుదునని" ఆయనతో చెప్పగా (13:36, 37); "యేసు - నాకొరకు నీ ప్రాణము పెట్టుదువా? ఆయనను ఎరుగనని నీవు ముమ్మారు చెప్పకముందు కోడికూయదని నీతో నిశ్చయముగా చెప్పుచున్నా ననెను" (13:38). తరువాత కొద్ది గంటలలో పేతురు ఏమి చేస్తాడో, చెప్పబోతాడో ఊహించలేక పోయాడు.

తరువాత ఆ రాత్రి, తోటలో, యేసును బంధించడానికి వచ్చిన సైనికులతో యుద్ధానికి దిగినట్టున్నాడు (18:10). కత్తి తీసికొని, మల్కు అనే ప్రధాన యాజకుని యొక్క దాసుని చెవిని తెగనరికాడు. ఆ దాసుని తల నరికివేయాలనే ఉద్దేశం పేతురుకు కలిగినా, గుడ్డేటుగా దెబ్బ కొట్టితే, ఆ మనుష్యుని కుడి చెవి తెగిపోయింది. పోరు ఎంత త్వరగా ఆరంభమయ్యిందో, అది అంత త్వరితంగానే నిలుపుచేయబడింది; కత్తి తన వరలో పెట్టుమని ప్రభువు అతనికి సెలవిచ్చాడు. కథలో ఈ భాగమందు, పేతురు బహు ధైర్యవంతుడైయున్నట్టు కన్పిస్తాడు.

యేసును ప్రధాన యాజకుని యింటికి తీసికొని పోయినప్పుడు, పేతురు యొక్క వ్యక్తిగతమైన విచారణ ఉద్రిక్త రూపాన్ని దాల్చింది. ఈ క్రింది సంఘటనలు సంభవించినప్పుడు, పేతురు వాస్తవంగా ప్రాంగణంలో ఉన్నట్టు యోహాను వివరించాడు (18:15, 16). తలుపు తీయడానికి నిలిచియున్న ఒక బానిస పిల్ల, అతడు లోనికి ప్రవేశిస్తుండగా చూచి, "నీవును ఈ మనుష్యుని శిష్యులలో ఒకడవు కావా?" (18:17) అని పేతురును

అడిగినప్పుడు – "అతడు కాననెను." యేసును పట్టుకొనడానికి పంపబడిన సైనికుల గుంపుతో పోరాడడానికి కొంతసేపటికి ముందు సిద్ధపడిన పేతురు యిప్పుడు ఒక చిన్న బానిస పిల్లచేత భయపెట్టబడ్డాడేమి!

ఆ రాత్రి చలిగా ఉంది, గనుక బానిసలును, సైనికులును చలిమంట వేసికొన్నారు. ఆ మంటవద్ద పేతురు కూడా నిలిచి చలికాచుకొంటున్నాడు. అప్పుడు వారిలో ఒకడు, "–నీవును ఆయన శిష్యులలో ఒకడవు కావా?" అని అడిగాడు (18:25). ప్రభువైన యేసుతో తనకెట్టి సంబంధము లేనట్టు, "నేను కాను" అని పేతురు రెండవ మారు అన్నాడు. రెండవ సారి కాదన్న తన చేదు అనుభవాన్ని పేతురు యింకను గుటక వేస్తుండగా, ఇంకొక బానిస మాట్లాడాడు ఇతడు తోటలో జరిగిన సంఘటనలకు సాక్షి. మరియు కత్తితో చెవి నరికినవాని బంధువు. "–నీవు తోటలో అతనితో కూడ ఉండగా నేను చూడలేదా?" (18:26) అని పేతురునడిగాడు. అందుకు పేతురు, "నేనెరుగనని మరియొక సారి చెప్పెను, వెంటనే కోడి కూసెను" (18:27). ప్రభువైన యేసు విచారింప బడి నిర్దోషియని తేల్చబడగా, పేతురు విచారింపబడగా పిరికివాడుగా తేలిపోయాడు.

ఈ సువార్త రచన ఎప్పుడును మూడు ప్రత్యేకమైన దశల్లో చదవాలి. మొదటి దశ: యేసు జీవితానికి ఏమి సంభవించింది అనేది. రెండవ దశ: మొదటి శతాబ్దపు జనులకు లేఖకుడు ఈ సంగతులను వివరించడంలో అతని ఉద్దేశం ఏమైయుంటుంది? మూడవ దశ: ఈ సువార్త నేడు మనకు ఎట్టి భావాన్ని యిస్తుంది? అని మనం అడగాలి.

"మొదటి దశలో" పేతురు యొక్క విచారణ. పేతురు యేసును ముమ్మారు ఎరుగ నన్నట్టు తెలుపుతోంది. "రెండవ దశ" గతంలో మనం పలుమార్లు చదివిన సందేశాన్నే ఈ భాగం మరల మన వద్దకు తెస్తుంది.[7] అంటే, హింస వచ్చినప్పటికిని ప్రభువు శిష్యులు ఆయనయందలి తమ విశ్వాసాన్ని బహిరంగంగా ప్రదర్శించడానికి యిష్టపడినవారై యుండాలి. ''మూడవ దశ'' మన విశ్వాస విషయంలో ధైర్యముగలవారమై ఉండి ప్రభువైన యేసు పట్ల మన బాధ్యతను ఒప్పుకోవాలి – లోకం మనలను బాధించినా అపహసించినా సరే.

1995లో నా మంచి స్నేహితులలో ఒకరు ఆఫ్రికాకు మిషినెరీగా వెళ్లాడు. అతడు ప్రభువును ప్రేమించినవాడు, ఇతరులతో సువార్త పంచుకోవాలని దృఢ నిశ్చయంగలవాడు. పరదేశపు మిషినెరీ అయ్యున్న కారణాన అత్యాసక్తిగల క్రైస్తవుడుగా అతడు నిలిచాడు. తన ఆరంభ రిపోర్టుల్లోని ఒకదానియందు, అతడు ఆఫ్రికాకు తన విమాన ప్రయాణాన్ని గూర్చి వ్రాశాడు:

> ... యుగాండాకు నేను వెళ్లే విమానంలో పోయిన వసంత కాలంలో నా ప్రక్కనే కూర్చున్న మనుష్యుడు ఒక విషయం చెప్పాడు. అది నాకు నీడలా తట్టింది. యేసు క్రీస్తును గూర్చి ప్రకటించడానికి మేము యుగాండా వస్తున్నామని చెప్పినప్పుడు, ఆ ఐరోపా మనుష్యుడు నాతో యిలా అన్నాడు, "క్షమించండి, ఆఫ్రికాలో యింతకు ముందునుండి వారికి దేవతలు లేవా?" ఎలా బదులు చెప్పాలో తెలియలేదు, అందువలన, నేనేమీ చెప్పలేదు.

ఆ అనుభవం విషయంలో నా స్నేహితుని బాధించింది ఏమంటే – ప్రభువు బంధింపబడిన రాత్రి పేతురును బాధించేదేనని నా ఆలోచన. మౌనం వహించేలా భయపెట్టించడం అంటే ఏమో నాకు కూడా తెలుసు. పేతురు యొక్క విచారణ గాథ మనకు హెచ్చరికయై ఉన్నట్టు – యోహాను సువార్త తెలుపుతోంది. మన లోకంలోని రహస్య ఆలోచనా శక్తులు చేయకూడనివి మనచేత చేయిస్తాయి: ఏమంటే ప్రభువును కాదనడం!

## పిలాతు యొక్క విచారణ

ఆ రాత్రి జరిగినవాటిని మామూలుగా చూచినవానికి, యేసు ఒక్కడు మాత్రమే విచారణ చేయబడినట్టు కన్పిస్తాడు. ఏదియెలాగున్నా, వారి సొంత విధానాల్లోనే పేతురు, పిలాతులు కూడా విచారణ చేయబడ్డారని యోహాను సువార్త చూపుతోంది. పేతురుకు అతని బాధ్యత పరీక్షింపబడింది. పిలాతైతే "నీవు యేసుతో ఏమి చేస్తావ్?" అనే మహా గొప్ప ప్రశ్నను ఎదుర్కొన్నాడు. ఆయనతో కూడ ఉండి యేసు యొక్క శిష్యులు మూడు సంవత్సరాలుగా ఏమేమి ఎదుర్కొన్నారో వాటన్నిటిని పిలాతు కొన్ని గంటల్లో ఎదుర్కోవలసి వచ్చింది.

యేసు పిలాతు ఎదుటికి తేబడినప్పుడు, గవర్నరు తొలి పలుకు, "మీరతని తీసికొని పోయి మీ ధర్మశాస్త్రము చొప్పున అతనికి తీర్పు తీర్చుడి" అనేది (18:31). పిలాతు యూదులను గాని, వారి ఎడతెగని లేక వితర్కాలను గాని లక్ష్యపెట్టినవాడు కాదు. అయితే, యేసునకు సంబంధించిన సమస్య తొలిగిపోయింది కాదు. అందువలన, ఈ "యూదుల వితర్కానికి" సమాధానమైన పరిష్కారం కనుగొనడానికి చేసిన ప్రయత్నంలో అతడు కొన్ని గంటలు గడిపాడు. అలా చేసిన మార్గంలో, యేసుతో ఏమి చేయాలనే ప్రశ్నతో కుస్తీ పట్టాడు.

మనం చూచినట్టుగా, పిలాతు తొలి ప్రతిచర్య – నిర్విచారంగా ఉండడం. అటుగాని యిటుగాని ప్రభువును గూర్చి పిలాతు ఏమీ పట్టించుకోలేదు (18:31). యేసు (అంతర్థానమైతే) కనబడకుండ పోతే బాగుండునని అతడు తలంచియుండవచ్చు. అనేకులు ఆయనను గూర్చి పట్టించుకోనే పట్టించుకోరు. యేసును గూర్చి సహజంగా నేడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితి జనులు ఆయన విషయంలో నిర్విచారంగా ఉండడమే. యేసును గూర్చి పిలాతు ఒక తీర్మానం లేకుండ తటస్థంగా ఉండడం వీలుపడదు. నేడు మనం కూడా అలాగే ఉండలేం!

పిలాతుకు యేసుపట్ల ఉన్న ప్రత్యుత్తరం – తిరస్కారము లేక అలక్ష్యం. ప్రభువును పిలాతు ప్రశ్నించే తొలిసారి, "నేను యూదుడనా యేమి? నీ స్వజనమును ప్రధాన యాజకులును నిన్ను నాకు అప్పగించిరిగదా; నీవేమి చేసితివి?" అని అడిగాడు (18:35). పిలాతు దృష్టిలో ప్రభువైన యేసు అంటే, తంటాలు కలిగించే యూదులలో ఒకడనియే. నేడు కూడా అనేకులు యేసును అలాగే అనుకొంటున్నారు. యేసు అని అన్నా, ఆయన ఉపదేశాలన్నా, అయిష్టతను కనుపర్చుతారు.

యేసుపట్ల పిలాతు తదుపరి ప్రత్యుత్తరం – తప్పించుకొనడం లేక దూరమవ్వడం.

మొదటి సారి ఆయనను ప్రశ్నించినప్పటినుండి నజరేయుని గూర్చి తీర్మానించడంలో తప్పించుకోవాలనే యత్నించాడు. పస్కా పండుగను బట్టి యేసును వదలిపెడతానని అతడు ప్రతిపాదించినప్పుడు (18:38, 39), ఆయనను గూర్చి స్థిరమైన తీర్మానం ఏమి చేయకుండుటకే పిలాతు ప్రయత్నించాడు. ఈలాటి స్పందనయే ప్రభువు పట్ల నేడు నీవు చూస్తున్నావా? ప్రజలు నేడు తమ్మును తాము తమ పనిలోనికి, వారి ఉల్లాసానికి, వారి సంగీతానికి, యేసుతో పట్టని తమ పార్టీల్లోనికి తమ్మును తాము లీనం చేసికొంటున్నారు!

యేసుపట్ల పిలాతు నాల్గవ ప్రతిచర్య భీతి. యేసు దేవుని కుమారుడని చెప్పుకొంటున్నట్టు పిలాతు వినినప్పుడు భయపడ్డాడు (19:8). యూదులందరిపై – చావు బ్రతుకుల అధికారం ఉన్నప్పటికిని, తన యెదుట నిలిచిన గలిలయుడంటే భయపడ్డాడు! దేశం దాటుతున్న హద్దులలో – "హెచ్చరిక! తుపాకులు వద్దు లేక బైబిల్లు వద్దు" అనే గుర్తులు ఉన్న దేశాల్లో పని చేసిన మిషినెరీలను నేనెరుగుదును. యేసుక్రీస్తు సువార్త శక్తి యెదుట యుద్ధాయుధాలకు వారు భయపడే దానికంటే ఆయనకు ఎక్కువగా భయపడి నేడు శక్తివంతమైన ప్రభుత్వాలు సహితం వణకుతాయి.

చివరిగా, యూదా మత నాయకుల ఒత్తిడికి తల ఒగ్గినవాడగుటవలన, పిలాతు యేసునకు ప్రత్యుత్తరమిచ్చాడు. యేసు నిర్దోషియని పిలాతుకు తెలుసు. అయితే ఏది నిజమో దానిపట్ల ధైర్యంగా నిలువలేకపోయాడు. దానికి బదులు అతడు తేలికైన మార్గాన్ని ఎన్నుకొని, యేసును సిలువ వేయ అనుమతించాడు. ఈ మార్గంలో, పేతురు పిలాతుల కథలు ఒకే విధంగా ఉన్నాయి.

యేసును గూర్చి తీర్మానం చేయకుండ ఎవడూ తప్పించుకోలేడు అని పిలాతు యొక్క కథ ఉదహరిస్తుంది. ఆయనను మనం అలక్ష్యం చేయవచ్చు, కాని మనం అలక్ష్యం చేయబడం. ఏదో ఒక విషయంలో "అవునో" – "కాదో" అని ఆయనను గూర్చి తేల్చుకోవలసి ఉంటుంది. ఆయనకు విరోధంగా తిరిగేలా మనం ఒత్తిడి చేయబడవచ్చు. అయినా ఆయన విషయంలో మనం ఏమి చేయబోతున్నామో తీర్మానించుకోవలసినవారమై ఉన్నాం.

## ముగింపు

మనం ఆలోచించిన మూడు విచారణలు సువార్త పట్ల మన ప్రత్యుత్తరాన్ని వర్ణిస్తాయి. యేసు విచారించబడి నిర్దోషియని తేల్చబడ్డాడు. నీవు, నేను, పేతురు, పిలాతులవలె, విచారణలో నిలిచియున్నాం. మనకు వేయబడే ప్రశ్న ఏమంటే, "మన కొరకు చనిపోయినవాని పక్షాన మనం నిలిచియుంటామా?" ఒత్తిడి తేబడినప్పుడు, "నేను నజరేయుడగు యేసు యొక్క శిష్యుడను అని చెప్పగలిగినంత బలిష్ఠులమా?" ఆయనను గూర్చి తీర్మానించుకొనకుండ తప్పించుకోలేం. యేసుతో నీవేమి చేస్తావ్?

## సూచనలు

[1]బలమైన వర్షాలు వచ్చినప్పుడు, కిద్రోను వాగు ఆ లోయ యొక్క నేలమీదుగా యెరూషలేమునకు తూర్పువైపునకు ప్రవహిస్తూ పట్టణ ప్రాకారంనుండి ఒలీవ కొండను వేరు చేస్తుంది. ఒలీవ కొండమీద గెత్సేమనే తోట ఉంటుంది (మత్తయి 26:36), ఈ వచనంలో ప్రస్తావించబడింది అదే. [2]సాధారణంగా రోమా గవర్నర్ ఓడరేవు పట్టణమైన కైసరయలో నివసిస్తాడు. అది ఎక్కువ రోమా నాగరికతతో కూడి ఉంటుంది. ఏదియెలాగున్నా, పస్కా పండుగ కాలంలో మాత్రం తన రాజకీయ, సైనిక సన్నాహంతో యెరూషలేములో ఉంటాడు. ఎందుకంటే ఆలాటి సందర్భంలో యూదులందరు ఒక్క చోట కూడుకొంటారు గనుక తిరుగుబాటు చేసే అవకాశం ఉంటుంది? (పస్కా అనేది యూదులను అణచిన – ఐగుప్తునుండి తప్పింపబడినదా? జ్ఞాపకార్థంగా జరిగే వేడుకయే గదా!) [3]అపొ. 10:28; 11:3, 12 చూడు. [4]ఎక్కువ ప్రాచీన చరిత్రకారులకంటె లేఖనాలు పిలాతును ఎక్కువ మర్యాదగా వర్ణిస్తాయి. అతడు క్రూరమైన రోమా అధిపతియై ఉండి యూదులను తృణీకరించి అవకాశమున్న ప్రతిసారి వారిని అభ్యంతర పెట్టేవాడు. ఇశ్రాయేలులో అతడున్న పది సంవత్సరాలు, దేవాలయపు బొక్కసంనుండి పిలాతు దొంగిలించేవాడు, పట్టణంలోని అభ్యంతరకరమైన రోమా "దేవతా ప్రతిమలను" తెచ్చి కలహం రేపాడు, గలిలయులగు కొందరు ఆరాధకులను చంపాడు (లూకా 13:1), గెరీజీము కొండ యొద్ద కూడిన సమరయుల సమూహాన్ని వధించాడు. "నేను యూదుడనా యేమి?" అని పిలాతు అన్నప్పుడు, అతడు వ్యంగ్యంగా మాట్లాడాడు, ఎందుకంటే యూదులంటే అతనికి ఉన్న ద్వేషాన్ని దాచిపెట్టడానికి అతడెన్నడు ప్రయత్నించలేదు. [5]ఇటీవల రాజకీయ తిరుగుబాటులో బరబ్బా హత్య చేశాడు (లూకా 23:19; అపొ. 3:14). [6]ప్రభువు గొర్రెల మంచి కాపరి అనే అంశంలో, యేసు తన ప్రాణాన్ని స్వయంగా తానే పెడతానన్న చర్చనీయాంశాన్ని ముందుగానే చూచాం (10:17, 18). [7]నీకొదేము కథ (యోహాను 3), పుట్టు గుడ్డివాని కథ (యోహాను 9) అనేవి యీ చర్చనీయాంశానికి ముందటి ఉదాహరణలై ఉన్నాయి.